క్లుప్తంగా

మావుళ్లమ్మకు విశేష పూజలు



మంత్రి శ్రీనివాసవర్మకు మావుళ్లమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారిని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం దర్శించుకున్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజాదికాలు నిర్వహించారు. మంత్రికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలు, అమ్మవారి ఫొటో అందించారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రెండవ రోజైన బుధవారం స్వామి, అమ్మవార్లకు అగ్నిప్రతిష్ఠ , కుంభావాహన, చక్రాబ్ది మండలార్చన, యాగశాల అర్చన, ప్రత్యేక హోమాలు, సాయంత్రం స్వామి అమ్మవార్లకు పవిత్రసమర్పణ, తీర్థగోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమనికి పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కాళ్ల: మండలంలోని పేకాట స్థావరంపై దాడి చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు కాళ్ల ఎస్ఐ ఎస్. శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. కాళ్ల మండలం పెదఅమీరంలోని రొయ్యల షెడ్డులో మంగళవారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.92,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వంతెన నిర్మాణ పనులు పరిశీలన



పెదఅమిరంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెనను పరిశీలిస్తున్న సర్పంచ్ సోమేశ్వరరావు

కాళ్ల: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నామని పెదఅమిరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తెలిపారు. పెదఅమీరంలోని నాగులకోడు మురుగు డ్రెయిన్‌పై అన్నా ఆదర్శనగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెనను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈప్రాంతంలో ఉన్న తూములను తొలగించడంతో దారిమార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని సుమారు రూ.3లక్షలతో వంతెన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పనులు దాదాపుగా పూర్తి కావచ్చుయన్నారు. త్వరలోనే ప్రారంభించి ప్రజలు వినియోగించుకునేటట్లు చేస్తామన్నారు. ఆయన వెంట కేతా శ్రీనివాస్, నడింపల్లి సుబ్బరాజు, కాలవ వెంకట్రావు, అలుగు చిన్నా, తదితరులు ఉన్నారు.

మనందరికీ విశ్వకర్మ స్ఫూర్తి మార్గదర్శకం కావాలి



స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అంజిబాబును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: శిల్ప కళానిపుణుడు, వాస్తుశాస్త్ర పితామహుడిగా పేరొందిన విశ్వకర్మ మహర్షి స్ఫూర్తి మనందరికీ మార్గదర్శకం కావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలో బుధవారం స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులకు ఎటువంటి అవసరం వచ్చినా అండగా ఉంటాసన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబును స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లక్కోజు నాని, సతివాడ నవీన్, శ్రీశైలపు నాగబాబు, పుట్ట ప్రతాప్, సతీష్ తదితరులు ఉన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వర్షాకాలంలో పొంచి ఉన్న వ్యాధుల భయం
- జాగ్రత్తలు పాటించాలన్న వైద్యులు



ఆడ ఎనాఫిలిస్ దోమ(ఫైల్)



ఆడ ఈడిస్ దోమ (ఫైల్)



గొల్లవానితిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: వర్షాకాలంలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. గత రెండు నెలలుగా వర్షాలు పడటంతో పల్లెల్లో కొన్ని ప్రాంతాలలో పారిశుద్ధ్యం లోపించడంతో మురుగునీరు నిల్వ ఉండిపోయి దోమలు విజృంభించి పగలు, రాత్రి తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. దీంతో ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు విజృంభిస్తాయి. గత వేసవి వెళ్లి వర్షాకాలం రావడంతో మంచినీటి చెరువుల్లో కొత్త నీరు రావడం దానికితోడు వర్షాలు పడటం వల్ల డయేరియా (అతిసార), టైఫాయిడ్‌లు వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తల పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు, పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

మలేరియా

మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్న జీవి సంక్రమించిన ఆడ ఎనాఫిలిస్ దోమకుట్టడం ద్వారా వస్తోంది. ఈ దోమలు మంచి నీరు, మురుగు నీటి నిల్వల్లో లార్వా వృద్ధి చెంది మలేరియాను వ్యాప్తి చేస్తాయి. ఈ దోమ కుట్టడం వలన ఏడు నుంచి 10 రోజుల లోపు ఒళ్లు నొప్పులతో కూడిన విపరీతమైన జ్వరం రోజుమార్చి రోజు వస్తుంది. ఆ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యుడిని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకొని తగిన జాగ్రత్తలు పాటించాలి.

డెంగీ

దోమకాటు ద్వారా అకస్మికంగా జ్వరంతోపాటు నొప్పులు వస్తే అది డెంగీ కావచ్చు. ఇది ఆడ ఈడీస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. ఇవి పగటి పూట ఎక్కువగా కుడతాయి. ఈ దోమకాటు వేసిన మూడు నుంచి 14 రోజుల్లో డెంగీ రావచ్చు. ఈ వ్యాధి వలన జ్వరంతో పాటు కీళ్లు, కండరాల నొప్పులు, వాంతులు అవుతాయి. కొంతమందికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తం కారుతుంది. దీనికి అత్యవసరమైన చికిత్సతో పాటు కొందరికి ప్లేట్‌లైట్స్ ఎక్కించాల్సి వస్తుంది. గర్భిణులు, చిన్న పిల్లలు ఇతర దీర్ఘ కాలిక వ్యాధులు ఉన్నవారికి ప్రమాదం ఎక్కువ. అందు వలన త్వరితగతిన చికిత్స చేయించుకోవాలి.

చికెన్ గున్యా

చికెన్ గున్యా వైరస్‌తో ఇన్‌ఫెక్ట్ అయిన ఈడీస్ దోమ కుట్టడం ద్వారా ఈ వ్యాధి వస్తోంది. ఈ దోమ కుట్టిన మూడు నుంచి 12 రోజుల లోపు జ్వరం వస్తుంది.తలనొప్పి, వాంతులు, వికారంతో హఠాత్తుగా వచ్చే జ్వరం దీని ముఖ్య లక్షణం.

ఈ వ్యాధి లక్షణాలు

చికెన్ గున్యా శరీరంలో అన్ని కీళ్లను బాధిస్తుంది. ముఖ్యంగా చేతివేళ్లు, కీళ్ల నొప్పుల వలన నిలబడలేని పరిస్థితి ఉంటుంది. జ్వరం తగ్గినా ఈ నొప్పులు చాలా కాలం ఉంటాయి. ఈ లక్షణాలు కనబడిన వెంటనే దగ్గర్లోని వైద్య, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలి

డయేరియా (అతిసార), టైఫాయిడ్

కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వల డయేరియా (అతిసార), టైఫాయిడ్ వస్తాయి. రోజుకు మూడు అంతకంటే ఎక్కువ సార్లు నీళ్ల విరోచనాలు అయితే దానిని అతిసార వ్యాధి అంటారు. ఇది బ్యాక్టీరియా వల్ల కానీ, వైరస్, పరాన్న జీవులు వలన కానీ రావచ్చు. వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి, దాహం నోరు ఎండిపోవడం, మూత్ర విసర్జన తగ్గిపోవడం ఈ వ్యాధి లక్షణాలు. అలాగే క్యూలెక్స్ దోమ వల ఫైలేరియా (బోధ) వస్తుంది. జపనీస్ ఎన్‌సెఫెలైటీస్ అనే వైరస్ వలన ఇది వ్యాప్తి చెందుతుంది. దీని వలన మెదడు వాపు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధులను అధిగమించే క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు, సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ముఖ్యంగా వైరస్, బాక్టీరియా వలన వ్యాధులు వస్తాయి. వీటి గురించి అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు. ప్రస్తుతం వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఇంట్లో వండుకునే పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు తీసుకోవాలి. వంటపాత్రలపై మూతలు పెట్టుకోవాలి. ఇంటి చుట్టూ మురుగు, వర్షపు నీరు నిల్వ లేకుండా, మురికి కూపాలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి శుక్రవారం తప్పకుండా డ్రై డే పాటించాలి.

ఎ. అరుణరాణి, వైద్యురాలు,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గొల్లవానితిప్ప

మోటార్ సైకిల్ చోరీ

ఉండి: వీరవాసరం మండలం రాయకుదురు గ్రామానికి చెందిన మేడిది సందీప్ అనే వ్యక్తి పని మీద ఈ యేడాది ఏప్రిల్ 4వ తేదీన ఉండికి వచ్చాడు. ఉండిలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మోటార్ సైకిల్ పెట్టి వెళ్లి పనిచూసుకుని తిరిగి వచ్చే సమయానికి అతని యమహా ఎంటీ మోటార్ సైకిల్ కనిపించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

వీరవాసరం: మండలంలోని కొణితివాడలో వేణుగోపాలస్వామి వారి ధర్మకర్తల మండలి పదవీ ప్రమాణ స్వీకారం మహోత్సవం బుధవారం కొణితివాడ గ్రామ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోభివృద్ధికి పాటుపడాలని వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, తోట సీతా రామలక్ష్మి, వీరవల్లి దుర్గ భవాని కలిదిండి సుజాత, ఎరక రాజు వెంకట్రామరాజు, ఎరక రాజు హరిహర రాజు, ఎరక రాజు చినబాబు, ఎరక రాజుగోపాల కృష్ణంరాజు, పులగం వేణుగోపాలరావు, వేగి మాధవ రావు, పెదబాబు, నూతన కమిటీ సభ్యులు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

ఉండి: ఇంట్లో చోరీ చేసేందుకు ప్రయత్నించిన దొంగలు విఫలమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన నడింపల్లి రుక్మిణీ అనే మహిళ ఈ నెల 5వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. తిరిగి 17వ తేదీ బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో కంగారుపడి ఇంట్లోకి వెళ్లి అన్నీ పరిశీలించుకోగా ఏఒక్కటీ చెక్కుచెదరకుండా ఉన్నాయని తన ఇంట్లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఛోరీకి యత్నించినట్లు మహిళ ఫిర్యాదుపై ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మిద్దెతోటలతో కుటుంబానికి ఆరోగ్యం



కేవీకేలో నిర్వహించిన మిద్దెతోటల పెంపకంపై సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

ఉండి: మిద్దెతోటల పెంపకంతో కుటుంబమంతా ఆరోగ్యంతో ఉంటుందని మార్టేరు విత్తనాభివృద్ధి క్షేత్రం ఏడీఏ డాక్టర్ టీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం కేవీకేలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్ దెబోరామెస్సియానా ఆధ్వర్యంలో మిద్దెతోటల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మిద్దెదోటల పెంపకం వాటి అవశ్యకతపై శ్రీనివాస్ మాట్లాడారు. పట్టణాలు, పల్లెల్లోను స్థలభావం కారణంగా సొంతంగా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించాలని ఆశఉన్నా అనుకూలంగా ఉండటం లేదన్నారు. కానీ మిద్దెతోటల పెంపకం అనేది మన ఆశలు తీరడంతో పాటు ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచుతుందని అన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ మిద్దెతోటల పెంపకంలో సాంకేతిక పరిజ్ఞాన్నాన్ని వినియోగిస్తే మరిన్ని ప్రయోజనాలు ఉంటాయన్నారు. అందుకే కేవీకే శాస్త్రవేత్తలు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. మిద్దెతోటల పెంపక నిపుణుడు వేణుగోపాల్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యం, ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టేవి మిద్దెతోటలు అని అన్నారు. మిద్దెతోటల పెంపకంలో కొన్ని పద్దతులు, విధానాలు పాటిస్తే ఎంతో చక్కగా సాగుచేసుకోవచ్చునని తెలిపారు. మిద్దెతోటల పెంపకంలో వాతావరణ, మట్టి చాలా ముఖ్యమైనవని అన్నారు. సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు ఎప్పుడూ ఆరోగ్యాన్నే అందిస్తాయని అన్నారు. అందుకే మన ఇంట్లో మనమే మన ఆరోగ్యాన్ని కాపాడుకునేలా మిద్దెతోటల పెంపకంపై అందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 70 మంది మహిళలు పాల్గొన్నట్లు తెలిపారు.

మొగల్లు పంచాయతీలో నిధుల దుర్వినియోగం

విచారణ జరపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

పాలకోడేరు: మండలంలోని మొగల్లు పంచాయతీలో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిను అదే గ్రామానికి చెందిన పెన్మెత్స వెంకటరాజు కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశానని బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. మొగల్లు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కె సుజాత 2022 సంవత్సరంలో సొంత ఖాతాకు పంచాయతీ నిధుల నుంచి పనులు నిమిత్తం 27,45,609, ఖర్చుల నిమిత్తం రూ.14,03,953లను స్వాహా చేసినట్లు ఆయన తెలిపారు. గంగరాజు కి ఇవ్వాల్సిన పనుల నిమిత్తం అని బిల్లు పెట్టి మొగల్లు గ్రామంలో ట్యాంక్ వాచర్‌గా చేస్తున్న గంగరాజు సొంత సిఎఫ్ఎంఎస్ అకౌంట్‌కి బిల్లు మొత్తం వేయకుండా కార్యదర్శిగా చేస్తున్న కే సుజాత సొంత ఎకౌంట్లో వేసుకున్నారు. కాంట్రాక్ట్ పంచాయతీ ఉద్యోగి అయిన కె గంగరాజు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు పెట్టి డ్రా చేసుకున్నారు. మొగల్లు గ్రామంలో ఊర మంచినీటి చెరువు మూడు ఎకరాలు విడగొట్టడానికి, పశువులచెరువులకు రెండు వైపులా రేవుల నిర్మాణం కొరకు, పంచాయితీ వద్ద చేసిన వివిధ వర్కులకు బోర్డు మీటింగ్ అజెండా నందు అంచనా మొత్తం ఖాళీగా ఉంచి వర్కులకు ఎస్టిమేట్ విలువ ముందుగా బోర్డు సభ్యులకు తెలియపరచకుండా కార్యదర్శి సుజాత సొంత ఖాతాలో వేసుకున్నారు. 2021 సంవత్సరంలో పంచాయతీ ఖర్చులను చెప్పి ఒకే రోజు రెండు బిల్లులు రూ 38,761, లక్షా 2వేల 53 రూపాయలు కలిపి మొత్తంరూ 1,40,814 ఏ నిమిత్తము ఖర్చు చేశారో తెలపకుండా ఆఫీసు ఖర్చులని బిల్లు పెట్టి పంచాయతీ కార్యదర్శి సుజాత సొంత ఖాతాలో వేసుకున్నారు. పై ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరినట్లు తెలిపారు.

ఆరోగ్యవంతమైన మహిళలతోనే మెరుగైన సమాజం



స్థానిక సీహెచ్‌సీలో స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ సభలో నేతలు



కాళ్ళలో చిన్నారికి వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి డాక్టర్ టి.భావన

ఆకివీడు: ఆరోగ్యవంతమైన మహిళలతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని కేంద్ర భారీ, ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి శిశువు ఆరోగ్యంగా పట్టాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు జేస్తోందన్నారు. కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో మహిళలకు అనేక పథకాలు అమలు జేస్తున్నారని చెప్పారు. మహిళలకు, ఆడపిల్లలకు రక్షణపథకం, లింగవివక్షతను అరికట్టడం, మహిళలకు హెల్ప్‌లైన్ పథకం, మహిళలకు శిక్షణ, ఉజ్వల పథకం, పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, సుకన్య సమృద్ధి యోజన పథకం వంటి అనేక పథకాలు అమలుజేశారని చెప్పారు. సభలో ఉపసభాపతి కె.రఘురామకృష్ణంరాజు, మంతెన రామరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా వైద్యాధికారిణి, రమాభాయ్, మహిళా శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారిణి శ్రీ లక్ష్మి, సీహెచ్‌సీ సూపరింటిండెంట్ సీహెచ్. ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగపరుచుకోవాలి

కాళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సీహెచ్. రంగంనాయుడు కోరారు. కాళ్ల పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈశిబిరాల్లో రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, కిషోర్ బాలిక ఆరోగ్య పరీక్షలు క్షయ వ్యాధి స్క్రీనింగ్ మానసిక వైద్య సేవలతో పాటు ఆయుష్ సేవలు అందించబడతాయన్నారు. ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆరేటి వెంకటరత్నప్రసాద్, వైద్యాధికారులు డాక్టర్ సరాబు సునీల్, టి.భావన, తహసీల్దార్ జి.సుందర్ సింగ్, ఎంపీడీవో జి.స్వాతి వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషకాహారం పై ప్రత్యేక శిక్షణ

వీరవాసరం: స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరూ ముఖ్యంగా మహిళలంతా ఆరోగ్యవంతంగా జీవనం సాగించాలని వక్తలు కోరారు. ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో సంపూర్ణ పోషకాహారంపై ప్రత్యేక శిక్షణ ప్రదర్శన నిర్వహించారు. ప్రజలంతా ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, వీరవాసం సర్పంచ్ చికిలే మంగతాయారు, సీహెచ్ఓ కొల్లి ప్రసాద్, తహసీల్దార్ ఏవి రామాంజనేయులు, ఎంపీడీవో బీవీ అప్పారావు, మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో అంతర్జాతీయ సదస్సు



భీమవరం ఎస్ఆర్‌కేఆర్‌లో అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్వాన్సడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ అల్గారిథమ్స్‌పై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు చెప్పారు. సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్‌వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, అంతర్జాతీయ సదస్సు చైర్మన్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు మాట్లాడుతూ డిసెంబర్ 11వ తేది నుంచి మూడు రోజుల పాటు సదస్సు జరుగుతుందన్నారు. అకడమిక్, ఇండస్ట్రీ, అంతర్జాతీయ పరిశోధకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ డేటా సైన్స్ అండ్ ఎమర్జింగ్ కంప్యూటింగ్ టెక్నాలజీస్ అనే అంశాలపై అధ్యయనానికి ఆస్కారముంటుందని అంతర్జాతీయ నిపుణులు సదస్సుకు హాజరవుతున్నట్లు వివరించారు. సదస్సు కన్వీనర్‌గా ఆర్ఎన్వి జగన్మోహన్, కో- కన్వీనర్‌గా జీఎస్‌విజి శిరీష వ్యవహరిస్తారని జగపతిరాజు, రామకృష్ణంరాజు తెలిపారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు

కాళ్ల: మండలంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పి.తులసి తెలిపారు. కాళ్ళ మండలం సీసలి, కాళ్ల గ్రామాల్లో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సుపోసిత్ భారత్, సక్షం భారత్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, పిల్లలు తీసుకోవలసిన పోషకాలు గురించి, ఆకుకూరల ప్రాముఖ్యత గురించి వివరించారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



పోషణ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సూర్యకుమారి

పాలకోడేరు: పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని పలువురు వక్తలు కొనియాడారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు అధ్యక్షతన ఐసిడిఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిబ్బంది మాట్లాడుతూ స్థూలకాయ నివారణకు నూనె వాడకాన్ని తగ్గించాలని, బాల్య దశ, సంరక్షణ, విద్య ఆవశ్యకతను గుర్తించి, చిన్నారుల ఆహారపు అలవాట్లపై ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కె.సూర్యకుమారి, స్థానిక ఎంపీటీసీ సభ్యులు ఎస్. నరేష్, స్థానిక ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి మహోత్సవం





విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధనపు ఎస్పీ భీమారావు

భీమవరం (ప్రకాశంచౌక్): విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని మంగళవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మను ప్రపంచంలోనే మొట్టమొదటి వాస్తు శిల్పిగా భావిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల అధికారులు జయంతి, మోహన్ రావు, సూపరింటిండెంట్ ఝాన్సీ, వి.సత్యనారాయణ, విశ్వబ్రాహ్మణ కార్పెండెర్స్ జిల్లా అధ్యక్షుడు చిట్టి మోజు భోగేశ్వరరావు, కార్యదర్శి చెప్పాడా చంద్ర శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో..

భీమవరం: విశ్వకర్మ జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ వి భీమారావు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.